ఈ నెల 3 నుంచి
పదో తరగతి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు

వికారాబాద్, మే 31 : పదో తరగతి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు జూన్ 3 నుంచి 13 వరకు జరుగుతాయని కలెక్టర్ ప్రతీక్‌జైన్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో 20 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేయగా.. 5203 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకాబోతున్నారన్నారు. 20 మంది చీఫ్ సూపరింటెండెంట్‌లు, 20 మంది డిపార్ట్‌మెంట్ అధికారులు, 4 ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పరీక్షల నిర్వహణకు సంబంధించి అన్ని ఏర్పాట్లు చేసినట్లు, జిల్లా స్థాయిలో వివిధ శాఖల అధికారులతో సమావేశం నిర్వహించి పరీక్షలకు సంబంధించిన అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. పరీక్ష నిర్వహణకు సంబంధించి అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని, ఎలాంటి పొరపాట్లు లేకుండా జాగ్రత్తగా, పకడ్బందీగా పరీక్షలు నిర్వహించాలని సూచించారు. పరీక్షలు నిర్వహించే సిబ్బంది పరీక్ష కేంద్రాల్లోకి సెల్‌ఫోన్లను తీసుకెళ్లడానికి వీల్లేదన్నారు. అదేవిధంగా ఎలాంటి ఎలక్ట్రానిక్ గాడ్జెట్స్ తీసుకెళ్లరాదని.. సెంటర్ల పరిసరాల్లో జిరాక్స్ సెంటర్లు మూసివేయాలని, 144 సెక్షన్ విధించాలని ఆదేశించారు. వైద్య శాఖ పరీక్ష కేంద్రంలో మెడికల్ కిట్‌తో పాటు ఒక ఏఎన్ఎంను నియమించాలని, పోలీస్ శాఖ తగిన బందోబస్తు సౌకర్యం కల్పించాలన్నారు. ప్రశ్నాపత్రాలను ఆయా పోలీస్ స్టేషన్ల పరిధిలో భద్రపరిచినట్లు ఆయన పేర్కొన్నారు.

రేషన్ కార్డుదారులకు 3 నెలల బియ్యం పంపిణీ

వికారాబాద్, మే 31 : జిల్లాలో 588 రేషన్ షాపుల ద్వారా 2,51,097 తెల్ల రేషన్ కార్డుదారులకు (8,97,270 మందికి) ప్రతి నెల 5,843 మెట్రిక్ టన్నుల సన్న బియ్యం పంపిణీ చేయడం జరుగుతుందని కలెక్టర్ ప్రతీక్‌జైన్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మన రాష్ట్రంలో అత్యధిక వర్షపాతం ఉన్నదని కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాలు గుర్తించి కార్డుదారులు ఇబ్బందిపడకూడదని ఒక్కసారిగా జూన్, జూలై, ఆగస్టు నెలలకు కలిపి 16,518 మెట్రిక్ టన్నుల సన్న బియ్యాన్ని పంపిణీ చేయుటకు ఇప్పటికే అన్ని ఏర్పాట్లు చేసినట్లు చెప్పారు. జిల్లాలో లక్ష మెట్రిక్ టన్నుల వరి ధాన్యాన్ని కొనాలని సంకల్పించి 128 వరి కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి ఇప్పటివరకు రైతుల నుంచి 67,250 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించి రూ.104 కోట్లు రైతుల ఖాతాలో నేరుగా జమ చేసినట్లు తెలిపారు. సుమారు 20 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం వస్తుందని అంచనా వేస్తున్నామన్నారు. గత సంవత్సరం, ఈనాటికి సుమారు 37000 మెట్రిక్ టన్నుల ధాన్యం మాత్రమే కొనుగోలు చేయడం జరిగిందన్నారు. ఈ రబీ సీజన్‌లో గత సంవత్సరం కంటే సుమారు రెండింతలు ధాన్యం జిల్లాలో కొనుగోలు చేసినట్లు పేర్కొన్నారు. ఇప్పటివరకు 24.70 లక్షల గోనె సంచులు, సరిపడా టార్పాలిన్లను కొనుగోలు కేంద్రాల్లో ఉంచినట్లు తెలిపారు. రైతులకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా కొనుగోలు సజావుగా జరిగేలా అన్ని జాగ్రత్తలు తీసుకున్నామని, ప్రభుత్వం చివరి వరి గింజ వరకు కొనుగోలు చేస్తుందని ఆయన స్పష్టం చేశారు.

ఉపకార వేతనం కోసం దరఖాస్తు చేసుకోవాలి

ఆదిబట్ల, మే 31: విదేశాల్లో ఉన్నత విద్యనభ్యసించాలనుకునే పేద మైనారిటీ విద్యార్థుల కోసం ప్రభుత్వం ఏర్పాటు చేసిన ముఖ్యమంత్రి విదేశీ విద్యా పథకం ఉపకార వేతనాన్ని పొందుటకు అర్హులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని రంగారెడ్డి జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ అధికారి నవీన్‌కుమార్‌రెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పథకం ద్వారా లబ్ధి పొందాలనుకునే విద్యార్థులు ఎంపిక చేయబడిన విదేశాల్లోని యూనివర్సిటీలలో జనవరి 1, 2025 నుంచి 30 జూన్ 2025 వరకు ప్రవేశం పొంది ఉండాలన్నారు. 1 జూన్ 2025 నుంచి 30 జూన్ 2025 వరకు www.telanganaepass.cgg.gov.inలో దరఖాస్తు చేసుకోవాలన్నారు. పథకం వివరాలు, అర్హత, దరఖాస్తు చేసుకునే దేశాలు, విద్యార్హతల వివరాలు, ఎంపిక విధానం వెబ్‌సైట్‌లో చూపబడినవని ఆయన పేర్కొన్నారు.

ధూమపానంతో వ్యాధులు పెరిగే ప్రమాదం

సీనియర్ సివిల్ జడ్జి, డీఎల్ఎస్ఏ సెక్రటరీ వెంకటేశ్వర్లు



కార్యక్రమంలో మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి, డీఎల్ఎస్ఏ సెక్రటరీ వెంకటేశ్వర్లు

వికారాబాద్, మే 31 : పొగ తాగడం వల్ల గుండె జబ్బులు, స్ట్రోక్, ఊపిరితిత్తుల వ్యాధులు వచ్చే ప్రమాదం పెరుగుతుందని సీనియర్ సివిల్ జడ్జి, డీఎల్ఎస్ఏ సెక్రటరీ వెంకటేశ్వర్లు అన్నారు. శనివారం ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకుని అంకిత స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో వికారాబాద్‌లోని మెడికల్ కాలేజి కన్‌స్ట్రక్షన్ సైట్‌లో పని చేస్తున్న కార్మికులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ధూమపానం మానేస్తే కొద్ది రోజుల్లోనే గుండె పనితీరు మెరుగుపడుతుందని, రక్తపోటు తగ్గి ఊపిరితిత్తులు ఆరోగ్యంగా మారుతాయని వైద్యులు చెబుతున్నారన్నారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ 1987 నుంచి ప్రతి సంవత్సరం మే 31న ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవాన్ని నిర్వహిస్తున్నదన్నారు. పొగాకు వాడకం వల్ల కలిగే నష్టాల గురించి ప్రజలకు అవగాహన కల్పించడం ఈ దినోత్సవం ముఖ్య లక్ష్యమని తెలిపారు. ధూమపానం మానేయడానికి వైద్యులిచ్చే సూచనలు, సలహాలను పాటించాలన్నారు. అనంతరం కార్మికులందరితో కలిసి ప్రతిజ్ఞ చేశారు. అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేసిన అంకిత సంస్థ ప్రతినిధులను ఆయన అభినందించారు. కార్యక్రమంలో అంకిత స్వచ్ఛంద సంస్థ జిల్లా కో ఆర్డినేటర్ ప్రకాశ్‌కుమార్, లీగల్ ఎయిడ్ కౌన్సిల్ అడ్వకేట్లు, అడ్వకేట్ రాజశేఖర్, అంకిత సంస్థ ప్రతినిధులు, ఫీల్డ్ ఆఫీసర్ శ్రీనివాస్, మండల కో ఆర్డినేటర్ సంజీవ్‌రావు, సైట్ ఇన్‌చార్జి గట్టయ్య పాల్గొన్నారు.

అంతా గోప్యం
పారదర్శకతకు పంగనామం

సిటీబ్యూరో, మే 31 (నమస్తే తెలంగాణ) : పారదర్శకతకు పంగనామం పెడుతూ.. ప్రతిష్టాత్మకంగా చేపట్టిన నిర్మాణ విధానాన్ని అంతా గోప్యంగా మార్చేశారు. అందుబాటులో ఉన్న టీజీబీపాస్ కంటే మరింత సులభతరమైన విధానం బిల్డ్ నౌ అని చెప్పుకొంటూ ప్రభుత్వం చేస్తున్న జాప్యం హెచ్ఎండీఏలో దరఖాస్తుదారులకు ఇబ్బందులు తప్పడంలేదు. దరఖాస్తు చేసుకున్న వెంటనే అనుమతులిస్తున్నామని చెబుతున్నా.. షార్ట్ ఫాల్స్ కారణంగా ఎదురయ్యే సమస్యల పురోగతి తెలుసుకునే వీల్లేకుండా పోతున్నది. దీంతో దరఖాస్తుదారులు కార్యాలయానికి అనివార్యంగా రావాల్సి వస్తున్నదని వాపోతున్నారు. గతంలో అమలులో ఉన్న డీపీఎంఎస్, టీజీబీపాస్‌లో దరఖాస్తు చేసిన వాటి పురోగతి తెలుసుకునే అవకాశం లేకుండా ఆ రెండు సైట్లూ మొరాయించడంతో భవన నిర్మాణ అనుమతుల కోసం హెచ్ఎండీఏ కార్యాలయానికి అటు ఆర్కిటెక్చర్లు, ఇటు నిర్మాణదారులు చక్కర్లు కొడుతున్నారు.

పూర్తి స్థాయిలో అమలుకాని బిల్డ్ నౌ

భవన నిర్మాణ అనుమతులను ఏఐ విధానంతో మరింత సరళీకరిస్తూ తీసుకువచ్చిన బిల్డ్ నౌ ఇంకా పూర్తి స్థాయిలో హెచ్ఎండీఏలో అమలులోకి రాకపోవడంతో దరఖాస్తుదారులకు ఇబ్బందులు పడుతున్నారు. గతంలో డీపీఎంఎస్, టీజీబీపాస్ ద్వారా దరఖాస్తు చేసి, నిర్మాణ అనుమతుల కోసం ఎదురుచూస్తున్న వారికి... ఇప్పుడు ఆ ఫైల్ ఏ దశలో ఉందనే విషయాన్ని తెలుసుకోవడానికి కార్యాలయానికి రావాల్సి వస్తోంది. పాత విధానంలోని టీజీబీపాస్ కానీ, డీపీఎంఎస్ ద్వారా వచ్చిన దరఖాస్తులు, వాటి పురోగతి, షార్ట్ ఫాల్స్ వంటి రిమార్కులతో సహా తెలుసుకునే విధంగా ఆ సైట్లలో సదుపాయం ఉండేది. కానీ బిల్డ్ నౌ వస్తుందనే సాకుతో... ఆ రెండు సైట్ల నిర్వహణను గాలికొదిలేశారు. దీంతో హెచ్ఎండీఏ పరిధిలో దరఖాస్తుదారులకు కొత్త సమస్యలను ఎదుర్కొంటున్నారు.

మొరాయిస్తున్న సైట్లు..

డీపీఎంఎస్, టీజీబీపాస్‌తోపాటు, కొత్తగా అమలులోకి వచ్చిన బిల్డ్ నౌ వెబ్‌సైట్ కూడా సాంకేతిక సమస్యలతో మొరాయిస్తున్నాయి. గతంలో పనిచేసిన సైట్లలోని సమాచారం తెలుసుకునే అవకాశం లేకుండా వస్తున్న సాంకేతిక సమస్యలపై అధికారులు దృష్టి పెట్టడం లేదు. కనీసం సైట్లలో ఉండే లోపాలను సవరించి.. అందరికీ అందుబాటులోకి తీసుకురావాల్సి ఉన్నా... అధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారు. దీంతో అనివార్యంగానే పాత సమాచారాన్ని తొక్కి పెడుతూ.. కొత్త సైట్లు అందుబాటులోకి రాక నగరవాసులు ఇబ్బందులు పడుతున్నారు. కొత్తగా తీసుకువచ్చిన బిల్డ్ నౌ వెబ్‌సైట్‌లో సిటిజన్ సెర్చ్ వినియోగించాలంటే ఓటీపీ సమస్యలతో ప్రక్రియ ముందుకు సాగడం లేదు. ఇక పాత దరఖాస్తుల సమాచారాన్ని తెలుసుకోవాలనుకుంటే హెచ్ఎండీఏ డీపీఎంఎస్, టీజీబీపాస్ సైట్లు తెరుచుకోవడమే గగనమైంది. దీంతో దరఖాస్తుల విధానాన్ని సులభతరం చేస్తూ తీసుకువచ్చిన ఆన్‌లైన్ విధానం లక్ష్యం కూడా అటకెక్కుతోంది. ఇక ఎంతో కీలకమైన చేంజ్ ఆఫ్ ల్యాండ్ యూజ్, ల్యాండ్ యూజ్, బిల్డింగ్ అప్రూవల్స్ తెలుసుకునే అవకాశం లేకుండా పోవడంతో.. తెర వెనుక ఏం జరుగుతుందోననే అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి.

సమీక్షా సమావేశంలో ఎఫ్ఎల్ఎన్ అమలు తీరుపై సంబంధిత అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రతీక్‌జైన్

విద్యా బోధన సులభతరంగా ఉండాలి

- వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్‌జైన్
- ఎఫ్ఎల్ఎన్ అమలు తీరుపై సంబంధిత అధికారులతో సమీక్ష

వికారాబాద్, మే 31: విద్యా ప్రమాణాలు మెరుగుపరిచేందుకు నూతన విధానాలతో ముందుకు సాగాలని వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్‌జైన్ అన్నారు. శనివారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్లో రెండు రోజుల పాటు సెంట్రల్ స్క్వేర్ ఫౌండేషన్, విద్యా శాఖ సంయుక్తంగా ఎంఈవో, సీహెచ్ఎం, డీఆర్పీ, సెక్టోరల్ అధికారులకు 2025-26 విద్యా సంవత్సరానికి సంబంధించిన ఎఫ్ఎల్ఎన్ కోసం జిల్లా వార్షిక ప్రణాళిక వర్క్ షాప్‌నకు కలెక్టర్ విచ్చేసి ఎఫ్ఎల్ఎన్ అమలు తీరును సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లాలో ప్రాథమిక స్థాయిలోనే పాఠశాలల్లో చిన్నారులు అక్షరాలు, సంఖ్యలు సులభతరంగా గుర్తించేలా విద్యాబోధన ఉండాలన్నారు. మండల స్థాయి ఉపాధ్యాయ, కాంప్లెక్స్ సమావేశాల్లో ఎప్పటికప్పుడు వినూత్నంగా, సులభతరంగా అర్థమయ్యేలా బోధనపై తర్ఫీదునివ్వాలని కలెక్టర్ తెలిపారు. ఆటపాటలతో ఉపాధ్యాయులు విద్యాబోధన సాగించాలని ఆయన తెలిపారు. వర్క్ షాప్‌లో జిల్లా విద్యాశాఖ అధికారి రేణుకాదేవి, సీఎస్ఎఫ్ ప్రాజెక్ట్ లీడ్ జెప్తా, ప్రాజెక్టు మేనేజర్ ఆయుషి, సీఎస్ఎఫ్ బృందం సభ్యులు పాల్గొన్నారు.

పేదల సొంత ఇంటి ఆకాంక్షను నెరవేర్చేలా..

పేద కుటుంబానికి సొంత ఇంటి ఆకాంక్షను నెరవేర్చే దిశగా అధికారులు కృషి చేయాలని కలెక్టర్ అన్నారు. కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాల పురోగతిపై ఎంపీడీవో, మున్సిపల్ కమిషనర్లు, ఎంపీవో, పంచాయతీ కార్యదర్శులు, వార్డు అధికారులతో జూమ్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాల పనులను అధికారులు ఎప్పటికప్పుడు క్షేత్రస్థాయిలో పర్యటించి పరిశీలించాలన్నారు. మొదటి విడతలో మంజూరైన ఇళ్ల నిర్మాణాలు పూర్తయ్యేలా అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలు అందిన 45 రోజుల్లోపు గ్రౌండింగ్ అయ్యేలా చూడాలని సూచించారు. ఇంటి నిర్మాణం 600 చదరపు గజాల లోపు ఉండాలనే విషయాన్ని లబ్ధిదారులకు సూచిస్తూ అవగాహన కల్పించాలని అధికారులకు వివరించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో మిగిలిపోయిన మరమ్మతు పనులను త్వరలో పూర్తయ్యేలా ఎంపీడీవోలు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. జిల్లాలో గుర్తించిన 331 పాఠశాలల్లో మరమ్మతు పనులను పాఠశాలల పునఃప్రారంభం కంటే ముందుగానే పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. జిల్లాలోని 583 చెంచు కుటుంబాలకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని అధికారులను ఆదేశించారు. ఇంటి స్థలం లేనప్పటికీ చెంచు కుటుంబాలకు ఇల్లు మంజూరు చేయాలని కలెక్టర్ తెలిపారు. సమీక్షా సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ సుధీర్, హౌసింగ్ పీడీ కృష్ణయ్య, డీపీవో జయసుధ, డీటీడీవో కమలాకర్‌రెడ్డి, హౌసింగ్ అధికారులు పాల్గొన్నారు.

కిలాడి లేడి

- హైకోర్ట్ న్యాయవాదినని.. న్యాయమూర్తినంటూ బిల్డప్
- కోట్లు కొట్టేసిన మాయలాడి
- జడ్జినని సీఐని నమ్మించి వేములవాడలో ప్రత్యేక దర్శనం
- కరీంనగర్‌లో అరెస్ట్ చేసిన మధురానగర్ పోలీసులు

బిత్తుకు ప్రసన్నరెడ్డి (నిందితురాలు)

వెంగళరావునగర్, మే 31 : అమాయకులే ఆ మాయలేడి టార్గెట్.. ఉద్యోగాలిప్పిస్తానని నిరుద్యోగులను నమ్మించి కోట్ల రూపాయలు కొట్టేసింది. హైకోర్టు న్యాయవాదినని ఓసారి.. న్యాయమూర్తినని మరోసారి మాయమాటలతో బోల్తాకొట్టించింది. చివరికి కరీంనగర్‌లో ఆ కంత్రీ కిలాడిని మధురానగర్ పోలీసులు అరెస్ట్ చేశారు. ఎస్సై శివశంకర్ కథనం ప్రకారం.. అంబర్‌పేట్‌కు చెందిన బిత్తుకు ప్రసన్నరెడ్డి (45) మోసాలు చేయడంలో ఆరితేరింది. వెంగళరావునగర్‌లో ఉండే ఎస్.జీవన్(35) ఉద్యోగాన్వేషణలో ఉండగా.. ఆమె పరిచయమైంది. హైకోర్టు న్యాయవాదినైన తనకు చాలా మంది జడ్జీలతో పరిచయాలున్నాయని.. రూ.15 లక్షలు ఇస్తే హైకోర్టులో రికార్డు అసిస్టెంట్ ఉద్యోగం ఇప్పిస్తానని జీవన్‌ను నమ్మించింది. ఆమె మాటలు నమ్మిన అతను ముందుగా రూ.6.5 లక్షలు ఇచ్చాడు. మిగతా రూ.8.5 లక్షలు వసూలు చేసేందుకు శైలజారెడ్డి అనే మహిళను హైకోర్టు న్యాయమూర్తిగా పరిచయం చేసింది. ఆమె అసిస్టెంట్ ఫిరోజ్‌ఖాన్ అని చెప్పి వారిద్దరిని పరిచయం చేసింది. ఆరు నెలలు గడిచినా ఉద్యోగం రాలేదు. ఈ నేపథ్యంలో రవి అనే వ్యక్తి ఫోన్‌చేసి తాను ప్రసన్నరెడ్డి చేతిలో మోసపోయానని.. ఉద్యోగం కోసం రూ.4.5 లక్షలిచ్చానని చెప్పాడు. ఈ క్రమంలో ప్రసన్నరెడ్డికు ఫోన్ చేయగా స్విచ్ఛాఫ్ రాగా పోలీసులకు ఫిర్యాదు చేశాడు. అలాగే.. తాను హైకోర్టు జడ్జినంటూ వేములవాడ పోలీస్ ఇన్‌స్పెక్టర్‌ను మాయమాటలతో బోల్తా కొట్టించి.. దర్శనానికి పోలీసు భద్రత కల్పించాలని కోరి.. ప్రత్యేక దర్శనం చేసుకుంది.

100 మందికి పైగా మోసం..

సుమారు 100 మందికి పైగా నిరుద్యోగులను హైకోర్టులో ఉద్యోగాల పేరిట మోసం చేసింది. ఒక్కొక్కరి నుంచి రూ.3 నుంచి రూ.10 లక్షల వరకు వసూలు చేసింది. నిజామాబాద్, కామారెడ్డి ప్రాంతాలకు చెందిన వారు ఎక్కువగా మోసపోయినట్లు పోలీసులు గుర్తించారు. తన వద్ద పనిచేసే డ్రైవర్లకు కూడా హైకోర్టులో ఉద్యోగాల పేరుతో ఒక్కొక్కరి నుంచి రూ.50 వేలు వసూలు చేసింది. ఓ మహిళ భర్తతో గొడవపడి ఆలయానికి వస్తే.. తాను అడ్వకేట్ అని నమ్మించి విడాకులు ఇప్పిస్తానని.. హైకోర్టులో ఉద్యోగం ఇప్పిస్తానని నమ్మించి ఆమె నుంచి రూ.3 లక్షలు కాజేసింది. ఆమె ద్వారా ఆమె బంధువులు 10 మంది వద్ద ఒక్కకొక్కరి నుంచి రూ.3 లక్షలు వసూలు చేసింది. 2016లో బంజారాహిల్స్‌లో ఆమెపై చీటింగ్ కేసు నమోదైంది ఇక జిత్యాలలో రెండు కేసులు బుక్కయ్యాయి.

కరీంనగర్‌లో చిక్కిన కిలాడి

బాధితుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేపట్టిన పోలీసులు కరీంనగర్‌లోని శ్రీ విల్లీస్‌లో కంత్రీ కిలాడి ప్రసన్నరెడ్డి మధురానగర్ పోలీసులకు చిక్కింది. మోసాల్లో ప్రమేయమున్న ఆమె భర్త రామలింగారెడ్డి సైతం పోలీసులు పట్టుకున్నారు. కిలాడి లేడి దంపతులను మధురానగర్ పోలీసులు అరెస్ట్ చేసి.. రిమాండ్‌కు తరలించారు.

మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలి

విద్యార్హతలు, ప్రతిభ ఆధారంగానే ఉద్యోగాలు వస్తాయని.. డబ్బులిస్తే ఉద్యోగాలిప్పిస్తామని చెప్పే మోసగాళ్ళ మాటలు నమ్మొద్దని మధురానగర్ ఇన్ స్పెక్టర్ ప్రభాకర్ కోరారు. మాయ మాటలతో మోసాలు చేసే ఇలాంటి వారిపట్ల జాగ్రత్తగా ఉండాలని సూచించారు.

తెలంగాణలో వచ్చేది బీఆర్ఎస్ సర్కారే..

తాండూరు, మే 31 : తెలంగాణ రాష్ట్రంలో వచ్చే ఎన్నికల్లో రానున్నది బీఆర్ఎస్ సర్కారేనని తాండూరు మాజీ ఎమ్మెల్యే పంజుగుల రోహిత్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం అమెరికాలోని డల్లాస్ నగరంలో జరుగనున్న బీఆర్ఎస్ రజతోత్సవ సభకు రోహిత్‌రెడ్డి వెళ్లారు. అందులో భాగంగా అమెరికాలో పర్యటిస్తున్న సమయంలో రామ మందిరానికి వెళ్లి ప్రత్యేక పూజలు చేశారు. శ్రీరాముని ఆశీర్వాదంతో తెలంగాణలో బీఆర్ఎస్ ప్రభుత్వం ఏర్పడుతుందన్నారు. ఎన్ఆర్ఐలతో కలువడం సంతోషంగా ఉందని ఆయన పేర్కొన్నారు.

ఎన్ఆర్ఐలతో రోహిత్‌రెడ్డి

మొక్కల సంరక్షణలో నిర్లక్ష్యం వహించొద్దు

ముఖ్య అటవీ సంరక్షణ అధికారిణి (సీఎఫ్) ప్రియాంక వర్గీస్

యాచారం మండలం గున్‌గల్ అటవీ ప్రాంతంలో మొక్కలను పరిశీలిస్తున్న ప్రియాంక వర్గీస్

యాచారం, మే 31 : మొక్కల సంరక్షణలో నిర్లక్ష్యం వహించొద్దని ముఖ్య అటవీ సంరక్షణ అధికారిణి (సీఎఫ్) ప్రియాంక వర్గీస్ అన్నారు. యాచారం మండలంలోని గున్‌గల్ ఫారెస్ట్‌ను శనివారం ఆమె సందర్శించారు. అటవీ శాఖ ఆధ్వర్యంలో గత నాలుగైదు సంవత్సరాలుగా పెంచుతున్న మొక్కలను ఆమె అటవీశాఖ అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రానున్న వనమహోత్సవం కార్యక్రమం ద్వారా విస్తారంగా మొక్కలు నాటాలని సూచించారు. నాటిన మొక్కలు ఎండిపోకుండా తగిన స్థాయిలో తప్పనిసరిగా నీరు అందించాలన్నారు. ఎండిపోయిన మొక్క స్థానంలో నూతన మొక్కను నాటి సంరక్షించాలని ఆదేశించారు. అడవులను సంరక్షించేందుకు అధికారులు ప్రధాన దృష్టి సారించాలని కోరారు. అడవిలో ఉన్న వన్య మృగాలను సైతం సంరక్షించేందుకు ఫారెస్ట్ అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. తమ విధులను సమర్థవంతంగా నిర్వహించాలన్నారు. గతంలో నాటిన మొక్కలు బాగున్నాయని, భవిష్యత్తులో నాటే ముక్కలను సైతం వృక్షాలుగా మలిచేందుకు అధికారులు సిబ్బంది కృషి చేయాలన్నారు. అడవులను సంరక్షిస్తేనే పర్యావరణ పరిరక్షణ సాధ్యమవుతుందని ఆమె పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా అటవీశాఖ అధికారి సుధాకర్, ఫారెస్ట్ డివిజన్ అధికారి వేణుమాధవ్, ఇబ్రహీంపట్నం రేంజ్ ఆఫీసర్ శ్రీనివాస్ రెడ్డి, యాచారం సెక్షన్ ఆఫీసర్ నరసింహ, బీట్ ఆఫీసర్ జంగారావు, సిబ్బంది ఉన్నారు.

తల్లి పుట్టిన రోజే తనయుడి హత్య

మాదాపూర్ : తల్లి పుట్టిన రోజును పురస్కరించుకుని ఓ యువకుడు స్నేహితులతో కలిసి మద్యం తాగుతుండగా.. మరో వ్యక్తి స్నేహితులతో వచ్చి మందు, డబ్బులు కావాలని అడుగగా.. ఇవ్వనని చెప్పాడు. ఆవేశంతో వారు కత్తులతో ఆ యువకుడిని పొడవగా మృతిచెందిన సంఘటన శుక్రవారం అర్ధరాత్రి మాదాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. సీఐ కృష్ణమోహన్ కథనం ప్రకారం.. మణికొండకు చెందిన జయంత్ గౌడ్(21) శుక్రవారం తన తల్లి లక్ష్మి పుట్టిన రోజు కావడంతో కేక్ కోసం రాత్రి 10 గంటల సమయంలో స్నేహితులతో కలిసి వేడుకలు జరుపుకొన్నారు. అనంతరం ఏడుగురు స్నేహితులతో కలిసి హైటెక్ సిటీలోని యశోద హాస్పిటల్ వెనుకవైపు ఉన్న నిర్మానుష్య ప్రాంతంలో మద్యం తాగుతున్నారు. రాత్రి 1:30 గంటల సమయంలో గుర్తు తెలియని ముగ్గురు వ్యక్తులు వచ్చి కత్తులతో బెదిరించి మద్యం బాటిల్, డబ్బులడిగారు. జయంత్ గౌడ్ నిరాకరించగా వారి మధ్య తీవ్ర వాగ్వాదం జరిగింది. కోపానికి గురైన దుండగులు జయంత్‌గౌడ్‌ను కత్తులతో పొడిచి పరారయ్యారు. డయల్ 100 నుంచి సమాచారమందుకున్న పోలీసులు తీవ్ర గాయాలతో ఉన్న జయంత్‌గౌడ్‌ను యశోద హాస్పిటల్‌కు తీసుకురాగా పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతిచెందినట్లు ధ్రువీకరించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ మార్చురీకి తరలించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. కాగా.. జయంత్‌గౌడ్‌పై ఇది వరకే బాచుపల్లి పోలీస్‌స్టేషన్‌లో హత్య కేసు నమోదై ఉన్నట్లు పోలీసులు తెలిపారు.

సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ఇన్‌చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్, చిత్రంలో ఎంపీలు, ఎమ్మెల్సీలు, నగర ఎమ్మెల్యేలు తదితరులు

ఇందిరమ్మ ఇండ్లపై అయోమయం

- రాజీవ్ యువ వికాసం యూనిట్ల ఎంపికలో బీసీలకు అన్యాయం
- కేసీఆర్ హయాంలో ఏర్పాటు చేసిన బస్తీ దవాఖానలు నిర్వీర్యం
- నగరాభివృద్ధి సమీక్షలో సమస్యల్ని ఎత్తిచూపిన దాసోజు, కాలేరు
- డబుల్ బెడ్రూం ఎందుకు పంపిణీ చేయడంలేదో చెప్పాలని డిమాండ్

సిటీబ్యూరో ప్రధాన ప్రతినిధి, మే 31 (నమస్తే తెలంగాణ):

నగరంలో వీధిలైట్ల నిర్వహణ అస్తవ్యస్తంగా మారి అంధకారం రాజ్యమేలుతోందని.. మరోవైపు కనీసం ఫాగింగ్ చేసే దిక్కులేక దోమలు స్వైరవిహారం చేస్తుండటంతో నగరవాసులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు దాసోజు శ్రవణ్, కాలేరు వెంకటేశ్ ఆవేదన వ్యక్తం చేశారు. జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో శనివారం హైదరాబాద్ జిల్లా సమీక్షా సమావేశం జరిగింది. ఇన్‌చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ఎంపీలు, ఎమ్మెల్సీలు, నగర ఎమ్మెల్యేలు పలువురు పాల్గొన్నారు. ఇందులో భాగంగా బీఆర్ఎస్ ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్, అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ కూడా సమావేశానికి హాజరై నగరవాసులు ఎదుర్కొంటున్న సమస్యల్ని ఏకరువు పెట్టారు. ప్రభుత్వ, అధికార యంత్రాంగం సరైన రీతిలో స్పందించకపోవడంతో జనం చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు చెప్పారు. కేసీఆర్ ప్రభుత్వ హయాంలో నగరంలో లక్ష డబుల్ బెడ్రూం ఇండ్లు లక్ష్యంగా చేపట్టిన అద్భుత కార్యక్రమంలో భాగంగా వేలాది ఇండ్లను పంపిణీ చేశామని, కానీ ఈ ప్రభుత్వం సిద్ధమైన ఇండ్లను నిరుపేదలకు పంపిణీ చేయడంలేదన్నారు. ప్రధానంగా ఇందిరమ్మ ఇండ్ల పథకం మార్గదర్శకాల్లో ఇప్పటికీ అస్పష్టత కొనసాగుతుందని, నగరంలో జాగాలు ఉన్న నిరుపేదలు అతి తక్కువ మంది ఉండటంతో పాటు చాలామందికి కొంత స్థలం ఉన్నా వాటికి సంబంధించిన డాక్యుమెంట్లు ఉండటంలేదన్నారు. రాజీవ్ యువ వికాసం పథకంలో భాగంగా హైదరాబాద్ జిల్లాలో ఎంపిక జాబితాను పరిశీలిస్తే బీసీ యువతకు తీవ్ర అన్యాయం జరిగిందని ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్ ప్రభుత్వం దృష్టికి తీసుకువచ్చారు. బస్తీ దవాఖానాలన్నీ నిర్వీర్యమైపోవడం ఆవేదన కలిగిస్తున్నదన్నారు.

హైడ్రా పేరుతో భయభ్రాంతులు

నగరంలో హైడ్రా పేరుతో ప్రభుత్వం ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తున్నదని ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. గ్రేటర్ హైదరాబాద్ అభివృద్ధిపై కాంగ్రెస్ ప్రభుత్వానికి దశ దిశ లేదని ఎంపీ అసదుద్దీన్ ఓవైసీ అసహనం వ్యక్తం చేశారు. రాష్ట్రాన